క్లుప్తంగా

సీఎంను కలిసిన వైస్ ఎంపీపీ



స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన స్టేషన్‌ఘన్‌పూర్ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేశారు.

నర్సింహులు మృతి తీరని లోటు



జనగామ : జనగామకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చిన్నం నర్సింహులు మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో మృతుడి చిత్ర పటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పోకల లింగయ్య, వ్యాపారులు ద్వారకాదాస్ బజాజ్, జూకంటి శ్రీశైలం, తదితరులు ఉన్నారు.

ఫిర్యాదు సరికాదు



బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీలో కొందరు వెన్నుపోటుదారులు తయారయ్యారని, జిల్లా అధ్యక్షుడిపై అధిష్టానానికి తప్పుడు ఫిర్యాదు చేయడం సరికాదని నియోజకవర్గ కిసాన్ కోఆర్డినేటర్ జంగిటి నరేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. 20 సంవత్సరాలుగా చేర్యాల, జనగామ ప్రాంత అభివృద్ధికి పాటు పడుతున్న మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై హైదరాబాద్‌లోని డీసీసీ భవన్‌లో కొందరు నాయకులు ఫిర్యాదు చేశారని అన్నారు. ఇలాంటి నాయకులు తమ ప్రవర్తనను మార్చుకోకపోతే వారికి కార్యకర్తలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి శ్రీనివాస్, నాయకులు కొక్కలకొండ బాబు, మహేందర్, ఎద్దు నాగయ్య, హరీష్ పాల్గొన్నారు.

భారీ మెజార్టీకి కృషి



పాలకుర్తి టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించేలా యూత్ నాయకులు కృషి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. పాలకుర్తి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసు హరీశ్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన యువజన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, పాలకుర్తి మండల ఇన్‌చార్జ్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామి సేవలు మరువలేనివి

జనగామ రూరల్: ఉపాధ్యాయ, విద్యారంగానికి అప్పారి వెంకటస్వామి చేసిన సేవలు మరువలేనివని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు అన్నారు. గురువారం వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్, ఆగయ్య, కనకయ్య ఉన్నారు.

మెజార్టీ గ్రామాల అంగీకారంతో బాధ్యతలు



దేవరుప్పుల: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అత్యంత మెజార్టీ సాధించే దిశలో గ్రామాల కాంగ్రెస్ కమిటీల అంగీకారం మేరకు మండల బాధ్యతలు తీసుకున్నానని మండల నూతన అధ్యక్షుడు నల్ల శ్రీరాములు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని అక్షర గార్డెన్‌లో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు ఇనుముల నాగరాజు అధ్యక్షతన అభినందనసభను ఏర్పాటు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో శ్రీరాములు మాట్లాడారు. ఝాన్సీరెడ్డిపై కొంతమంది అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు కాడబోయిన గణేశ్, దేవరుప్పుల మండల సీనియర్ నాయకులు కాసారపు ధర్మారెడ్డి, ఉప్పుల సురేష్ బాబు, ఓడపెల్లి రవీందర్, పాండు , యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు ధరావత్ రాజేశ్ పాల్గొన్నారు.

ఇలాగైతే 'కొనుగోళ్లు' ఎలా..?

- సబ్ మార్కెట్ యార్డులోకి మురుగు నీరు



మురుగు నీటితో బురదమయమైన సబ్‌మార్కెట్ యార్డు

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులోకి గ్రామంలోని మురుగు నీరంతా కాల్వ ద్వారా వచ్చి చేరుతోంది. దీంతో యార్డు మొత్తం బురదమయంగా మారింది. కాగా యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణ ఏ విధంగా జరుగుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలోని పదో వార్డుకు సంబంధిన ఇళ్లలోని మురుగు నీరంతా కాల్వతో మార్కెట్ యార్డు వరకు వచ్చి ఆగిపోతోంది. గతంలో కాల్వ నిర్మాణం యార్డు ప్రహరీ వరకు చేసి వదిలేశారు. దీంతో మురుగు నీరంతా సమీప ఇళ్లలోనికి వెళ్తుండడంతో ప్రహరీకి రంధ్రం చేశారు. దీంతో యార్డులో నీరంతా నిలిచి బురదగా మారింది. కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తే ట్రాక్టర్లు, లారీలు వచ్చే వీలు లేకుండా బురదలో దిగబడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి త్వరగా మురుగునీరంతా యార్డులోనికి రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మెగా నేత్ర వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

జనగామ: పట్టణంలోని శరత్ మాక్స్ విజన్ ఆధ్వర్యంలో గురువారం మెగా నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ మౌనిక, క్యాంప్ మేనేజర్ యాకూబ్, ఆపరేషన్స్ మేనేజర్ నాగరాజ్, ఆప్టోమెట్రిస్ట్ భవాని, శిరీష, క్యాంపు కౌన్సిలర్ వంశీ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు అనూష, లావణ్య, వెన్నెల ఆధ్వర్యంలో 200 మందికి కంటి పరీక్షలు చేశారు.

చిల్పూరు ఆలయంలో జెడ్పీ సీఈఓ పూజలు



చిల్పూరు: చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రధాన అర్చకుడు రవీందర్‌శర్మ, అర్చకులు రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ జెడ్పీ సీఈఓ అనీల్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీఓ మధుసూదన్, ధర్మకర్త మేకల మల్లేషం, పొన్నం శ్రీనివాస్, సిబ్బంది రమేష్, వీరన్న, లక్ష్మి, మల్లికార్జున్, వసంత, విశాల్ పాల్గొన్నారు.

కంకర రోడ్డుపై గ్రామస్తుల నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రఘునాథపల్లి: మండలంలోని మండలగూడెం నుంచి పోతురాజుతండా వెళ్లే రోడ్డు బీటీ నిర్మాణం కోసం కాంట్రాక్టర్ కంకర పోసి వదిలేయడంతో గ్రామస్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నత్తనడకన రోడ్డు పనులు సాగుతుండటంతో గ్రామస్తులు గురువారం రోడ్డెక్కి కంకరపై నిలిచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కంకరపోసి కాంట్రాక్టర్ వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. త్వరగా బీటీ రోడ్డు పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, గాదె సిద్దేశ్వర్, తోట నరేష్, పొన్నాల అంజనేయులు, మెతుకు సాయికృష్ణ, రైతులు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

నియామకం



కొలిపాక సతీష్

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ నాయీబ్రాహ్మణ సమాఖ్య సంక్షేమ సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన కొలిపాక సతీష్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల్లి వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కొలిపాక సతీష్ గురువారం ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులంతా కలిసి కాంగ్రెస్ పార్టీకి అండగా తెలంగాణ నాయీ బ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవా సంఘం ఏర్పడిందన్నారు. తనపై నమ్మకంతో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించిన అధ్యక్షుడు వెంకన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావుతో పాటు సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా వెంకటయ్య



జఫర్‌గఢ్: మండలంలోని రఘునాథ్‌పల్లి గ్రామానికి చెందిన ఎడ్ల వెంకటయ్యను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియమిస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరా గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ అధికార ప్రతినిధిగా నియమించినందుకు ఇందిర, పార్టీ జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విగ్రహాల తయారీకి నగదు అందజేత



విగ్రహాల తయారీదారు నుంచి రశీదు తీసుకుంటున్న మధుసూదన్‌రెడ్డి

తరిగొప్పుల: గౌడ కులస్తుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నూతనంగా నిర్మించబోయే రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ప్రతిష్ఠించే ఎల్లమ్మ, మునిరాజ్ విగ్రహాల ఏర్పాటుకు స్థానిక ఎంపీటీసీ అర్జుల మధుసూదన్‌రెడ్డి, జ్యోతి దంపతులు నగదు అందజేశారు. ఈ మేరకు రూ.1,01,016 గౌడ కుల సంఘం సమక్షంలో విగ్రహాల తయారిదారుడికి గురువారం ఇచ్చారు. తాళ్లపల్లి పోషయ్య, జాగీరు మల్లయ్య, కొయ్యడ రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ


బచ్చన్నపేట: పార్లమెంట్ ఎన్నికల కోసం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని సిబ్బందికి ఎంపీడీఓ రఘురామకృష్ణ సూచించారు. గురువారం ఆయన మండలంలోని నారాయణపురంలోని ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ విశాలాక్షితో కలిసి పరిశీలించి మాట్లాడారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి దేవీ ప్రసాద్, కారోబార్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన కేమిడి బాబు (40) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. అతనికి భార్య కవిత, కూతుర్లు శ్రావణి, కావ్య, స్వాతి ముగ్గురు ఉన్నారు. బాబు తండ్రి 15ఏళ్ల క్రితమే మృతి చెందడం, కొడుకులు లేకపోవడంతో పెద్ద కూతురు కావ్య తండ్రికి తలకొరివి పెట్టింది. తండ్రికి కూతురు తలకొరివి పెట్టడంతో చూసిన వారంతా కన్నీరు మున్నీరుగా విలపించారు. ముగ్గురు ఆడపిల్లలే కావడం కన్న తండ్రి చనిపోవడంతో ఆ చిన్నారులు రోధించిన తీరు ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది.

ఎండిన పంటకు పరిహారం చెల్లించాలి



పాలకుర్తి టౌన్: సాగునీరు అందక ఎండిన రైతుల వరిపంటకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం తహసిల్దార్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు దుంపలి సంపత్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుకు వినతి పత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, కమ్మగాని శ్రీకాంత్, మారం రవి కుమార్, నిరంజన్, రామారావు, భోనగిరి శ్రీనివాస్, పెనుగొండ సోమేశ్, పెంతల మహేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామంలో విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగి బర్మ రవి (51) బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి వెల్ది గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదే విధంగా కుర్చపల్లిలో ప్రమాదవశాత్తు గాయపడిన ఎంపీటీసీ వట్టిపల్లి విజయరాజిరెడ్డి నివాసానికి కడియం చేరుకొని పరామర్శించారు.

విద్యుత్ అధికారుల నివాళి

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన బర్మ రవి మృతదేహాన్ని విద్యుత్ శాఖ అధికారులు సందర్శించి నివాళులర్పించారు. డిపార్ట్‌మెంట్ ద్వారా అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులకు రూ.20 వేలు అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

తీగారంలో..

జఫర్‌గఢ్: మండలంలోని తీగారం మాజీ సర్పంచ్ గోనె జైపాల్‌రెడ్డి తల్లి నాగలక్ష్మి దశదినకర్మలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ బృందంతో కలసి గురువారం పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, రాజేష్, గాదెపాక సుధాకర్‌బాబు, రమేష్ ఉన్నారు.

సంతాపం

దేవరుప్పుల: మండలంలోని చిన్నమడూరు, దేవునిగుట్టలో అకాల మృతి చెందిన మడికొండ కుమారస్వామి, బానోత్ కిషన్ కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్షుడు నల్ల శ్రీరాములు పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం

నేడు కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

బచ్చన్నపేట: బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నేడు (శుక్రవారం) నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని లిమ్రా గార్డెన్‌లో నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథిగా భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ హాజరవుతున్నారని అన్నారు. ఎంపీ ఎన్నికల విధివిధానాలపై తెలియజేస్తారన్నారు. నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని కోరారు.

కేసు నమోదు

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల వాగులో నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్, ట్రాలీ ఆటోపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాలుగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు వివరించారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమతులు లేకుండా మొరం తరలించొద్దు

బచ్చన్నపేట: ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం, ఇసుకను తరలించొద్దని ఎస్సై కంకల సతీష్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. కొన్నె గ్రామంలో అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న పొక్లెయినర్, ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. పొక్లెయినర్ యజమాని వేముల లక్ష్మణ్‌గౌడ్, ట్రాక్టర్‌ల డ్రైవర్లు చెరుకు కృష్ణారెడ్డి, పసుల లింగంలపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా కలప, ఇసుక, మొరంను తరలిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కానిస్టేబుళ్లు అనిల్, జమాలొద్దీన్ పాల్గొన్నారు.

సమావేశం నిర్వహించకుండా మండల కమిటీ ఎలా ప్రకటిస్తారు..?

చిల్పూరు: ఎవరికి తెలియకుండా.. కనీసం సమావేశం నిర్వహించకుండా బీజేపీ మండల కమిటీని మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్ బుధవారం ఎలా ప్రకటిస్తారని నాయకులు గుంజ రఘుపతి, పన్నీరు అశోక్, నామాల రాహుల్‌చీమల విజయ్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో గురువారం వారు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీలో పటిష్టంగా ఉన్న కార్యకర్తలను విస్మరించి ఒకే కమ్యూనిటీ, ఒకే కారణంతో ఇంట్లో ఉండి మండల అధ్యక్షుడు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏన్నో ఏళ్లుగా కేవలం కార్యకర్తలుగా పార్టీ జెండాను మోసిన వారిని వదిలి అధ్యక్షుడు ఎవరిని సంప్రదించకుండా వేసిన కమి టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పౌష్టికాహారాన్ని వినియోగించుకోండి

రఘునాథపల్లి/పాలకుర్తి/చిల్పూరు/జఫర్‌గఢ్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూచించారు. గురువారం రఘునాథపల్లి మండలంలోని ఫతేపూర్, పాలకుర్తి మండలం గూడూరు, మల్లంపల్లి, చిల్పూరు మండలం కొత్తపల్లె, జఫర్‌గఢ్ మండలంలోని సూరారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారం, చిరుధాన్యాలు, ఆకు కూరగాయాలు, రక్తహీనత తదితర అంశాలపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ తదితరులు

దేవరుప్పుల: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రజాప్రతినిధులు, అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో తోడ్పాటు అందించాలని ఎంపీపీ బస్వ సావిత్రి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలతోపాటు పాఠశాలలు, హాస్టల్‌లో మిషన్ భగీరథ తాగునీటిసౌలభ్యం కొరత ఉన్నప్పుడు సత్వరమే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునేందుకు తగు నిధుల కేటాయింపులు ఉన్నట్టు ఏఈ మానస తెలిపారు. మేజర్ గ్రామాల్లో ట్యాంకులకు ప్రత్యామ్నాయ పైపు లైన్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కత్తుల విజయ్‌కుమార్ రెడ్డి, తహసీల్దార్ హుస్సేన్, బీసీ, చేనేత సంక్షేమ శాఖ జిల్లా అధికారులు రవీందర్, చౌడేశ్వరీ, ఎంపీఓ సురేష్‌కుమార్ ,ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు సుజాత, ఎంపీటీసీ జాకీర్, ఈజీఎస్, ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.

వడ్డెరకాలనీలో సమస్యల తిష్ట



డ్రెయినేజీ లేక రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామ పంచాయతీ పరిధి 7వ వార్డులోని వడ్డెర కాలనీలో సమస్యలు తిష్ట వేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో డ్రెయినేజీలు, రోడ్లు సరిగా లేవు. ఇళ్లలో వాడిన మురుగు నీరు రోడ్డుపైకి వస్తోంది. దీంతో కాలనీవాసులు నడవలేక పోతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. రెండ్రోజులకు ఒకసారి వచ్చే మిషన్ భగీరథ నీరు మురుగునీటితో కలుస్తోంది. ఆ నీటిని తాగితే ఒంటిపై దద్దుర్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల విధులపై నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన నోడల్ అధికారులతో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. ఎన్నికల నిబంధనలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధులు, చేపట్టాల్సిన పనులపై తగిన సలహాలు, సూచనలతో వారికి అవగాహన కల్పించారు.

ఘనంగా ధ్వజారోహణం



ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు



భూమిపూజ చేస్తున్న భద్రయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని తిరుమలనాథ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కలకోట రంగాచార్యులు, రామానుజచార్యులు, శేషాచార్యులు, రంగాచార్యులు, శ్రీనివాసచార్యులు, నరేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారికి మంగళవాయిద్యాలు, సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామార్చన, బాలభోగం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్టాపనం, ధ్వజారోహణం, గరుడముద్దలు వేయడంతదితర పూజలు చేపట్టారు.

యాగశాల నిర్మాణానికి భూమిపూజ

తాటికొండలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో రూ.7లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం చేయనున్న యాగశాల, పాకశాల పనులకు గురువారం దేవస్థాన చైర్మన్ పండుగ భద్రయ్య భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయంలో యాగశాల, పాకశాల నిర్మాణం చేస్తున్నామని, దైవ కార్యానికి భక్తులు, దాతలు సహకరించాలని ఆయన కోరారు. కాగా, దాతలు పండుగ రాజేశ్వర్ రూ.5,016, పండుగ బుచ్చయ్య రూ.5,116 విరాళంగా అందించారని తెలిపారు. వైస్ చైర్మన్ ఎడమ కుమార్, శివాలయం చైర్మన్ బేతి రత్నాకర్‌రెడ్డి, నాయకులు కట్టమల్లు, కె.మహేందర్, చల్లా తిరుపతి, మార్క శ్రీనివాస్, నాయకులు, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



మాట్లాడుతున్న హరికిషన్

చిల్పూరు: కాకతీయుల కాలంలో నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయాన్ని రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో శ్రీరామనవమి నాటికి అభివృద్ధి చేస్తామని ఆలయ చైర్మన్ కోరుకొప్పుల హరికిషన్ అన్నారు. మండలంలోని నష్కల్ గ్రామంలోని ఆలయ ప్రాంగణంలో గురువారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఎంపీటీసీ పాశం శిరీష, నాయకులు పాశం సురేష్, గంటె ఉపేందర్, పుల్యాల రాజిరెడ్డి, రంగు సురేష్, కూరపాటి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

తరిగొప్పుల: భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని, ప్రతీ ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఎస్టీ మోర్చా భువనగిరి పార్లమెంట్ ప్రబారి భూక్య నరేష్ నాయక్, జనగామ అసెంబ్లీ ఎస్టీ మోర్చా రాంకోఠి నాయక్ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలో పలు గ్రామాల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్‌నాయక్, మండల ఉపాధ్యక్షుడు రాజు, రాంనర్సింహారెడ్డి, నాగభూషణం, ప్రవీణ్ నాయక్, మహేష్ నాయక్ పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

జఫర్‌గఢ్: మరో సారి మోదీని ఆశీర్వదించి ప్రధానిగా గెలిపించాలని కోరుతూ కేంద్రప్రభుత్వ పథకాలపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, సింగారపు రమేష్ మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. నాయకులు కట్ట సురేందర్, మొట్టక ప్రేమ్ కుమార్, పవన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.